ముగిసిన ఎంఈఎస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటన

అదనపు కలెక్టర్లతో చర్చిస్తున్న అధికారుల బృందం

కంఠేశ్వర్, ఫిబ్రవరి 8 : శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ అంశాల అధ్యయనం కోసం నిజామాబాద్‌కు వచ్చిన మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటన శనివారం ముగిసింది. 30 మందితో కూడిన అధికారులను ఆరు బృందాలుగా విభజించి, ఒక్కో బృందానికి ఒక్కో గ్రామం కేటాయించగా ఎనిమిది రోజుల పాటు అధ్యయనం చేశారు. శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. గ్రామాల్లో పథకాల అమలు, డ్వాక్రా మహిళా సంఘాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, ఉపాధిహామీ, వ్యవసాయ కూలీల పని తీరుపై వారు చేసిన అధ్యయనం గురించి వివరించారు. తమకు సహకారం అందించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపి, వీడ్కోలు తీసుకున్నారు.

రెండో స్పెల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 8 : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో రెండో స్పెల్ ప్రాక్టికల్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. బోధన్ పట్టణంలోని విజేత, ఉషోదయ, విద్యావికాస్, బోధన్, కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎడపల్లి మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయొద్దీన్ అస్లాం, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని మరో 15 కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

ఇందల్వాయి (డిచ్‌పల్లి), ఫిబ్రవరి 8 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాధవ్‌నగర్ శివారులో రైలుపట్టాల వద్ద శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై వివరాల ప్రకారం.. సుమారు 30 ఏండ్ల యువకుడు తిరుపతి –అకోలా వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు 8712658591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

పీవోలు, ఏపీవో శిక్షణ తరగతుల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 8 : నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో కూడిన ఉపాధ్యాయ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఈనెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు జిల్లాకేంద్రంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో శనివారం మొదటి విడుత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు పక్కాగా తెలుసుకోవాలని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే, శాసన మండల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందని, బ్యాలెట్ పద్ధతితో నిర్వహించే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఎక్కువ వ్యవధి పట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఓపికగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోగా పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉన్న వారికి టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని ఆదేశించారు. పంపిణీ కేంద్రం వద్ద చెక్‌లిస్ట్ ప్రకారం పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అన్నారు. తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టంచేశారు.

పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాస్టర్ ట్రైనర్లు హన్మాండ్లు, వర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రకుమార్, రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

ప్రయోగాల గురించి వివరిస్తున్న సంస్థల ప్రతినిధులు

రాకెట్ల నమూనాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

చందూర్, ఫిబ్రవరి 8 : మండలకేంద్రంలోని శ్రీ సాయి విద్యాలయంలో డీఆర్డీవో, డీఆర్డీఎల్, ఎన్ఆర్ఎస్‌సీ, ఇస్రోల సౌజన్యంతో స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో పేరుతో శనివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై అబ్దుల్ కలాం పుస్తకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా జ్ఞానం పెరుగుతుందని అన్నారు. పాఠశాలలో ప్రదర్శించిన ఉపగ్రహాలు, రాకెట్లతో పాటు చంద్రయాన్ ప్రయోగాల నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ప్రయోగాల గురించి ఆయా సంస్థల ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత ఉప్పల మధు, ట్రస్మా ప్రతినిధులు జయసిహాగౌడ్, జనార్దన్, రాసనిత్యానందం, గోజూరి అరుణ్, పలు పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

నలుగురికి తీవ్రగాయాలు

చెట్టును ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

ఇందల్వాయి (డిచ్‌పల్లి), ఫిబ్రవరి 8 : అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయిన ఓ కారు చెట్టును ఢీకొట్టగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామశివారులో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఆర్యనగర్‌కు చెందిన రమేశ్, జగన్, నరేశ్, గణేశ్ డిచ్‌పల్లిలో ఇటుక బట్టీ వ్యాపారం చేస్తారు. శనివారం ఉదయం కారులో కరీంనగర్‌లోని శుభాకార్యానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా బర్ధిపూర్ శివారులో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

'ప్రజావాణి' తాత్కాలికంగా వాయిదా

కంఠేశ్వర్, ఫిబ్రవరి 8 : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల నిబంధనల మేరకు వాయిదా వేశామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇందల్వాయి (డిచ్‌పల్లి), ఫిబ్రవరి 8 : డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు పుణ్యాహవాచనం, అంకురార్పణం, అఖండ దీపారాధన, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు , గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీన నిర్వహించే సీతారామ కల్యాణోత్సవానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ జాంబోరిలో సత్యశోధక్ విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఫిబ్రవరి 8 : తమిళనాడు రాష్ట్రం తిరుచిలో గత నెల 28 నుంచి ఈనెల 3వ వరకు నిర్వహించిన జాతీయ జాంబోరి కార్యక్రమానికి సంబంధించి శనివారం గ్రేడ్‌లు ప్రకటించారు. ఇందులో సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కబనర్చి, గ్రేడ్ –ఏ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు కలర్‌పార్టీ, మార్చ్ ఫాస్ట్, క్యాంప్ క్రాఫ్ట్, అడ్వెంచర్ యాక్టివిటీస్, జానపద నృత్యం, స్థానిక సంప్రదాయల ప్రదర్శనల్లో ప్రతిభ కనబర్చినట్లు వివరించారు.

హిందూ సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల నాయకులు, యువకులు

రుద్రూర్ (వర్ని), ఫిబ్రవరి 8 : వర్ని మండలకేంద్రంలో హిందూ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందూ ఆలయాల సంరక్షణ కోసం సనాతన బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హిందూ ఆలయాలు, ఆలయ భూములు, ఆస్తులను కాపాడాలని కోరారు. నిజామాబాద్ కంఠేశ్వర్ ఆలయానికి ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ నుంచి రామాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పీహెచ్‌సీలో మందుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 8 : నగరంలోని సీతారాంనగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. మందుల నిల్వ, టీకాలు నిల్వ చేసే ఫ్రిడ్జి, ల్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. దవాఖానను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, ఫార్మాసిస్ట్ సూపర్‌వైజర్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఎక్సైజ్ సీఐ ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 8 : ఓ పత్రికలో వల్గర్ పదాలు ఉపయోగిస్తూ తనపై వార్తలు రాస్తున్నారని ఎక్సైజ్ సీఐ చేసిన ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. వార్తలు రాసిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో సీఐగా పనిచేస్తున్న స్వప్న శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో పీఎం రమేశ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్మికులకు ఆదివారం సెలవు ప్రకటించాలి

రుద్రూర్ (వర్ని), ఫిబ్రవరి 8 : తమకు ఆదివారం సెలవు ప్రకటించాలని పంచాయతీ కార్మికులు కోరారు. వర్ని మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు శనివారం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారని, గుర్తింపు కార్డులు, షూ, యూనిఫాం తదితర వాటిని అందజేయాలని కోరారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బాల్కొండ, ఫిబ్రవరి 8: మండలకేంద్రానికి చెందిన వేంపల్లి కృష్ణ అలియాస్ నర్సయ్య (46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసమస్యలతో జీవితంపై విరక్తి చెంది వ్యవసాయ పొలం వద్ద శుక్రవారం పురుగుల మందు తాగగా, కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ విఠల్ తెలిపారు. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

కోటగిరి, ఫిబ్రవరి 8 : మండలంలోని ఎత్తొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ శశాంక్ పరీక్ష అట్టలు, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అలివేలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'మాతృశ్రీ' వార్షికోత్సవం

కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు, హైస్కూల్ కరెస్పాండెంట్ సిరిగిరి దిగంబర్ రావు, డైరెక్టర్ జయశ్రీ

బోధన్, ఫిబ్రవరి 8: పట్టణంలోని మాతృశ్రీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ మధుమలంచ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, విద్యావికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాతృశ్రీ హైస్కూల్ కరెస్పాండెంట్ సిరిగిరి దిగంబర్ రావు, డైరెక్టర్ జయశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మహతో

బోధన్ రూరల్, ఫిబ్రవరి 8: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞాశ్రీ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శించిన అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లత రాజు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రస్మ జిల్లా అధ్యక్షుడు కోడాలి కిశోర్, ఎంఈవోలు నాగయ్య, మంజుషా, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 8: మండంలోని అంకాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామానికి సంపంగి నర్సయ్య(41) తన ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నాడని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఏర్గట్ల, ఫిబ్రవరి 8 : వేసవికాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఏఈ స్వరాజ్, ఎంపీవో శివచరణ్ పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు. ఏర్గట్లతోపాటు మండలంలోని తాళ్లరాంపూర్‌లో వాటర్ ట్యాంకులు, బోరుబావులను శనివారం పరిశీలించారు. గ్రిడ్ ఏఈ ఉదయ్, సిబ్బంది జాకీర్ హుస్సేన్, భోజన్న, అనిల్ యాదవ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

'విజయ్' విద్యార్థినికి మూడు పురస్కారాలు

మాక్లూర్, ఫిబ్రవరి 8 : మండలంలోని మానిక్‌బండార్ వద్ద ఉన్న విజయ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని బొబ్బిలి శరణ్య జేఎన్టీయూలో నిర్వహిస్తున్న 13వ స్నాతకోత్సవంలో మూడు స్వర్ణ పతకాలను అందుకోనున్నదని ప్రిన్సిపాల్ సురే తెలిపారు. 2023–2024 అకడమిక్ సంవత్సరంలో పట్టభద్రురాలైన శరణ్య పురస్కారాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. శరణ్యను కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సెక్రటరీ అమృతలత, అధ్యాపకులు అభినందించారు.

జోన్ -2 చివరి ఆయకట్టుకు నీటివిడుదల

మోర్తాడ్, ఫిబ్రవరి 8: ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ జోన్ 2 చివరి ఆయకట్టు కోసం వదర కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి తెలిపారు. వరదకాలువ వెంట నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 8 : వీధి కుక్కలతో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ సూచించారు. శనివారం పట్టణంలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త విభజన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ సాయి చరణ్ పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్‌లో మొసలి కలకలం

బంధించిన పోలీసులు, అటవీశాఖాధికారులు

అధికారులు బంధించిన మొసలి

ఏర్గట్ల, ఫిబ్రవరి 8: మండలంలోని తాళ్లరాంపూర్‌లో మొసలి ప్రత్యక్షం కావడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. అటవీ అధికారులు, ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో చికెన్ సెంటర్ తెరవడానికి వచ్చిన యజమానికి సమీపంలో ఏదో అలికిడి వినిపించడంతో వెళ్లి చూడగా మొసలి కనిపించింది. దీంతో ఒక్కసారి భయపడిన చికెన్ సెంటర్ యజమాని వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం ఇచ్చాడు. స్థానిక ఎస్సై ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ శివయ్య, కానిస్టేబుల్ రఘువీర్ గౌడ్, బీట్ ఆఫీసర్లు సురేశ్,వరుణ్ అక్కడికి చేరుకొని గ్రామస్తుల సహకారంతో మొసలిని బంధించారు. ఫారెస్టు అధికారులు మొసలిని వెంట తీసుకెళ్లారు. కాకతీయ కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా చెరువుల్లోకి నీరు వస్తున్నదని, ఏర్గట్ల చెరువుతోపాటు తమ గ్రామచెరువులోకి కూడా మొసళ్లు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సిరికొండ, ఫిబ్రవరి 8 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్, పదోతరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా వార్షిక పరీక్షలు రాయాలని ప్రిన్సిపాల్ గడ్డం రాకేశ్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్పల్లి ప్రభుత్వ దవాఖానలో ఆరోగ్యమేళా

ధర్పల్లి, ఫిబ్రవరి 8 : మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్యమేళా నిర్వహించారు. పీడీయాట్రిక్ డాక్టర్ శివశంకర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ చంద్రశేఖర్ 169 మందికి వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజు, విశాలారాణి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- **8 తులాల బంగారం, నగదు అపహరణ**

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 8 : నిజామాబాద్ నగర శివారులోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో నివాసించే మహ్మద్ ఇలియాస్ ఓ స్కూల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం నైట్ డ్యూటీ ఉండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా తాళంతోపాటు ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని 8 తులాల బంగారు నగలతో పాటు సుమారు రూ. 25 వేల నగదు చోరీ జరిగిందని బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలాన్ని సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్, ఐదో టౌన్ ఎస్సై కె.వెంకట్‌రావు పరిశీలించి, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరోటౌన్ ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్‌డీలర్లు

మోర్తాడ్, ఫిబ్రవరి 8: మోర్తాడ్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న కృష్ణను రేషన్‌డీలర్ల సంఘ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు విజయ్, అజయ్, రాజ్‌కుమార్, రాజన్న, ప్రసాద్, సందీప్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

'సర్కార్ భూముల'కు రిజిస్ట్రేషన్ చేయించాలి

మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 8: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా పేదలకు పంపిణీ చేసిన ఎన్ఎస్ఎఫ్ భూములకు రిజిస్ట్రేషన్ చేయించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం బోధన్‌లోని తెలంగాణ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్ఎస్ఎఫ్ భూముల లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. ఎన్ఎస్ఎఫ్‌కు చెందిన సుమారు ఆరు వేల ఎకరాల భూమిని మూడు దఫాలుగా ఫ్యాక్టరీ ప్లాంటేషన్లలో పనిచేసిన కార్మికులతో పాటు పలువురు నిరుపేదలకు అందజేశారని తెలిపారు. భూపంపిణీ పథకం కింద భూములను పంపిణీ చేయగా, ఏడాది కాలంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపై ఈనెల 17న కలెక్టర్‌ను కలిసి నివేదిస్తామని తెలిపారు. కోటగిరి మండల మాల మహానాడు నాయకుడు మిర్జాపురం సాయన్న, ల